సాక్షి యాదాద్రి భువనగిరి

బుధవారం, 28, ఫిబ్రవరి, 2024



ఉత్సవాలకు ముస్తాబు

యాదాద్రిలో 5వ తేదీ నుంచి శివరాత్రి ఉత్సవాలు, 11 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి.

- 8లో



ప్రయోగాత్మక బోధన..

గడ్డిపల్లి జెడ్పీహెచ్ఎస్ జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు పవిత్ర విద్యార్థులకు ప్రయోగాత్మకంగా బోధన చేస్తున్నారు.

- 8లో



కల్వర్టు లేక అవస్థలు

రహీంఖాన్‌పేట సమీపంలో రైతులు వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు సరైన దారిలేక అవస్థలు పడుతున్నారు.

- 9లో

న్యూస్‌రీల్

మార్చి 5న జెడ్పీ సర్వసభ్య సమావేశం

భువనగిరిటౌన్: జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం మార్చి 5న జెడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జెడ్పీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శోభారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఇద్దరు మంత్రులు, ఐదుగురు ఎమ్మెల్యేలు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. సభ్యులు, జిల్లా స్థాయి అధికారులు సకాలంలో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

రైతాంగాన్ని ఆదుకోవాలి



మాట్లాడుతున్న జహంగీర్

వలిగొండ : భూగర్భ జలాలు అడుగంటడడంతో పంటలు ఎండిపోతున్న రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. మంగళవారం వలిగొండ మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బునాదిగాని కాల్వలో నీరు లేకపోవడంతో భూగర్భజలాలు అడుగంటి మోటార్లు కాలిపోతున్నాయని, పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుని రైతాంగానికి సాగునీటితో పాటు ప్రజలకు తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కొండమడుగు నరసింహ, బట్టుపల్లి అనురాధ, మాటూరి బాల్ రాజు, సిర్పంగి స్వామి, చీర్క శ్రీశైలం రెడ్డి, తుర్కపల్లి సురేందర్, కల్యూరి రామచంద్రర్, గణపతి రెడ్డి, కొండే కిష్టయ్య, మొగిలిపాక గోపాల్, గాజుల ఆంజనేయులు, వాకిటి వెంకటరెడ్డి, కందడి సత్తిరెడ్డి, ఏలే కృష్ణ, కల్యూరి ముత్యాలు, యాదయ్య, చంద్రమౌళి, లింగం, సురేష్, జంగయ్య పాల్గొన్నారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో మంగళవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. క్షేత్రపాలకుడిగా పూజలందుకుంటున్న శ్రీఆంజనేయస్వామికి ఆకుపూజ విశేషంగా నిర్వహించారు. ప్రధానాలయంతో పాటు విష్ణు పుష్కరిణి వద్ద, పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని సింధూరం, పాలతో అభిషేకించారు. అనంతరం తమలపాకులతో ఆకుపూజ జరిపించారు. హనుమంతుడికి ఇష్టమైన నైవేద్యాన్ని సమర్పించి, భక్తులకు ప్రసాదంగా అందజేశారు. ఇక ప్రధానాలయంలో నిత్య పూజలు సంప్రదాయంగా కొనసాగించారు. శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, జోడు సేవలు వైభవంగా కొనసాగాయి. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

అర్థం చేసుకునే గుణాన్ని పెంపొందించాలి



మాట్లాడుతున్న ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, చిత్రంలో జిల్లా శిశు సంక్షేమాధికారిణి కృష్ణవేణి

భూదాన్‌పోచంపల్లి: బాల్యం నుంచే పిల్లలకు సర్దుబాటు, అర్థం చేసుకునే గుణాలను పెంపొందించాలని జిల్లా శిశుసంక్షేమ అధికారిణి కృష్ణవేణి అన్నారు. మంగళవారం భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో సార్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గృహహింస చట్టంపై నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. అనంతరం చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ లింగ వివక్షత లేకుండా పిల్లల పెంపకంలోనే సమానత్వం అనే భావనతో తల్లిదండ్రులు తమ పిల్లల పెంచాలన్నారు. సార్ప్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ ప్రమీల అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి, ఎస్ఐ భాస్కర్‌రెడ్డి, సఖి ప్రతినిధులు లావణ్య, సుమలత, సార్ప్ సంస్థ ప్రతినిధులు సరిత, స్వరూప, శ్రీనివాసరావు, రాకేశ్, రమేశ్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఏ జెండా ఎగిరేనో..!

నేడే భువనగిరి మున్సిపాలిటీ నూతన చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక

- వ్యూహాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ
- రెండు పదవులు తమవే అంటున్న కాంగ్రెస్
- కీలకంగా మారిన కమలం పార్టీ
- ఎన్నికకు ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు

సాక్షి, యాదాద్రి : భువనగిరి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు దక్కించుకునేందుకు బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. చైర్మన్, వైస్ చైర్మన్‌ను దించేందుకు ఒక్కటైన అధికార ప్రతిపక్షాలు.. నూతన చైర్మన్, వైస్ చైర్మన్ పదవుల కోసం విడివిడిగా ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇప్పటి వరకు పనిచేసిన చైర్మన్ ఏనబోయిన ఆంజనేయులు, వైస్ చైర్మన్ చింతల కిష్టయ్యను కౌన్సిలర్లు జనవరి 23న అవిశ్వాసం పెట్టగా.. నెగ్గింది. దీంతో వారు పదవులు కోల్పోయారు. నూతన చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక బుధవారం జరగనుంది. ఉదయం 11గంటలకు మున్సిపల్ కౌన్సిలర్లతో అధికారులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ ఎన్నిక కోసం ప్రిసైడింగ్ అధికారిగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ నియమితులయ్యారు.



మున్సిపాలిటీ సమావేశ మందిరంలో సిద్ధం చేసిన కుర్చీలు

ప్రస్తుతం బలాబలాలు ఇలా..

భువనగిరి మున్సిపాలిటీలో 35 మంది కౌన్సిలర్లతో పాటు ఎమ్మెల్యే ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ఉన్నారు. అయితే, అవిశ్వాసానికి ముందు బీఆర్ఎస్ పార్టీకి 20మంది, కాంగ్రెస్‌కు 9మంది, బీజేపీకి ఆరుగురు కౌన్సిలర్లు ఉన్నారు. అవిశ్వాసం నెగ్గిన తర్వాత నూతన చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల కోసం తేది ప్రకటించే వరకు జరిగిన పరిణామాలతో పార్టీల బలాబలాలు మారిపోయాయి. ప్రస్తుతం కాంగ్రెస్ 15, బీఆర్ఎస్ 13, బీజేపీకి ఏడుగురు సభ్యులు ఉన్నారు.

చైర్మన్ పదవికి కాంగ్రెస్‌లో ముగ్గురు పోటీ

సంఖ్యాపరంగా మెజార్టీ ఉన్న కాంగ్రెస్ పార్టీ నుంచి చైర్మన్ పదవిని ముగ్గురు కౌన్సిలర్లు ఆశిస్తున్నారు. తంగెళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, పోతంశెట్టి వెంకటేశ్వర్లు, పోత్నక్ ప్రమోద్ కుమార్ పోటీపడుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి నిర్ణయం మేరకు చైర్మన్ అభ్యర్థి పేరు ప్రకటిస్తారని సమాచారం. 15 మంది కౌన్సిలర్లతోపాటు ఎక్స్ అఫీషియో సభ్యుడు కాంగ్రెస్‌కు ఉన్నారు. వీరితో పాటు మరో ఇద్దరు కౌన్సిర్లు మద్దతు ఇస్తారన్న నమ్మకం కాంగ్రెస్ నుంచి వ్యక్తమవుతోంది.

క్యాంపు నుంచి నేరుగా సమావేశానికే..

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు కుటుంబ సభ్యులతో సహా ఈ నెల 20న క్యాంపునకు వెళ్లారు. వీరంతా బుధవారం ఉదయం 11గంటలకు సమావేశానికి నేరుగా హాజరు కావడానికి ఏర్పాట్లు చేసుకున్నారు.

ఎత్తుకు పైఎత్తులు..

మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లను దించే వరకు ఐక్యతా రాగం పాడిన బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ కౌన్సిలర్లు ఆ తర్వాత అటుఇటు మారిపోయారు. బీఆర్ఎస్‌కు చెందిన చైర్మన్, వైస్ చైర్మన్‌లను దించేందుకు అవిశ్వాసం పెట్టారు. అయితే, అవిశ్వాసానికి ముందుగానే వారు రాజీనామా చేశారు. సాంకేతిక కారణాలతో రాజీనామాలు ఆమోదించలేదు. అవిశ్వాస ఓటింగ్‌లో 31 మంది ఏక గ్రీవంగా వారికి వ్యతిరేకంగా ఓటు వేశారు. అనంతరం చైర్మన్ పదవి దక్కించుకునేందుకు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లు ఎత్తుకు పైఎత్తు వేస్తున్నాయి. తాము కోల్పోయిన పదవులను కాంగ్రెస్‌కు దక్కకుండా బీఆర్ఎస్ పార్టీ బీజేపీతో పొత్తుకు సిద్ధమైంది. అయితే, ఆ పొత్తు కుదరలేదు. బీఆర్ఎస్ మద్దతును సున్నితంగా తిరస్కరించిన బీజేపీ.. తామే చైర్మన్ రేసులో ఉంటామని చెబుతోంది. మున్సిపాలిటీలో బీఆర్ఎస్‌కు మద్దతు ఇస్తే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర స్థాయిలో బీఆర్ఎస్, బీజేపీల పొత్తు సంకేతాలు ప్రజల్లోకి పోయే ప్రమాదం ఉందని బీజేపీ భావిస్తోంది. అందుకే మున్సిపల్ చైర్మన్ పదవికి తామే స్వయంగా పోటీకి దిగాలని భావిస్తున్నామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ ‘సాక్షి’తో చెప్పారు. బీజేపీ నుంచి కౌన్సిలర్లు మాయ దశరథ, బొర్ర రాకేష్‌లు చైర్మన్ కోసం పోటీలో ఉన్నట్లు తెలిసింది.

కాంగ్రెస్‌లో చేరిన మోతె పిచ్చిరెడ్డి



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మోతె పిచ్చిరెడ్డి, పూలమ్మ దంపతులు

ఆత్మకూరు(ఎం): మండలంలోని కూరెల్ల గ్రామానికి చెందిన ఉమ్మడి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ మోతె పిచ్చిరెడ్డి, నార్మాక్స్ మాజీ డైరెక్టర్ పూలమ్మ దంపతులు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి సమక్షంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో వారికి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. మంత్రి మాట్లాడుతూ అందరి సహకారంతో జిల్లాను అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. కాగా.. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో మోతె పిచ్చిరెడ్డి-పూలమ్మ దంపతులతో పాటు టి.రేపాక బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎంపీటీసీ గడ్డమీది ఆదినారాయణ, కూరెల్ల బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తండ మంగమ్మశ్రీశైలం గౌడ్, జెడ్పీటీసీ కొడిత్యాల నరేందర్ గుప్తా, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి, వైస్ ఎంపీపీ భాషబోయిన పద్మాపాపయ్య, మాజీ సర్పంచ్ జన్నాయికోడె నగేష్, మండల ప్రధాన కార్యదర్శి కందడి అనంతరెడ్డి, మండల నాయకులు తండ శ్రీశైలం, పోతగాని మల్లేశం గౌడ్, బాషబోయిన సత్యనారాయణ, సూదగాని లక్ష్మణ్, మోతె నవీన్, ఎర్ర విఠల్‌రెడ్డి, ముద్దసాని సిద్దులు, ఎలగందుల శ్రీనువాస్, బొంత అంజయ్య పాల్గొన్నారు.

ఇక.. మరో రెండు గ్యారంటీలు

- నేటి నుంచి అమలులోకి రూ.500కు గ్యాస్, ఉచిత విద్యుత్ పథకాలు
- జిల్లాలో 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగదారులు 1,61,099 మంది
- ప్రజాపాలనలో గ్యాస్ సబ్సిడీ కోసం దరఖాస్తు చేసుకున్న వారు 2,30,412 మంది
- వీరందరికీ చేకూరనున్న లబ్ధి



సాక్షి, యాదాద్రి: కాంగ్రెస్ ఆరు గ్యారంటీల్లో భాగంగా మహాలక్ష్మి కింద రూ.500లకే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాలను మంగళవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. బుధవారం నుంచి ఈ రెండు పథకాలు అమలులోకి రానున్నాయి. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు ప్రభుత్వం జిల్లా కలెక్టర్‌కు పంపించింది. తెల్ల రేషన్‌కార్డు (ఆహార భద్రతా కార్డు)ప్రామాణికంగా ఈ రెండు పథకాలను వర్తింపజేయనున్నారు. వీటి ద్వారా జిల్లాలో 200 యూనిట్లలోపు విద్యుత్ వాడే గృహ వినియోగదారులకు ఉచిత విద్యుత్ అందడంతో పాటు, నగదు బదిలీ పద్ధతిన గ్యాస్ వినియోగదారులకు రూ.500లకే సిలిండర్ అందనుంది.

జిల్లాలో 2,16,942 ఆహార భద్రత కార్డులు

జిల్లాలో 2,16,942 ఆహార భద్రత కార్డులున్నాయి. జిల్లాలో 3,11,415 గృహ వినియోగ గ్యాస్ కనెక్షన్లు ఉండగా.. ప్రజాపాలనలో గ్యాస్ సబ్సిడీ కోసం 2,30,412 మంది దరఖాస్తు చేసుకున్నారు. గ్యాస్ వినియోగదారులు ముందుగానే మొత్తం డబ్బులు చెల్లించి సిలిండర్ కొనుగోలు చేయాల్సి ఉంటుంది. తరువాత ప్రభుత్వం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు రూ.500పోను మిగిలిన సబ్సిడీ మొత్తాన్ని బదిలీ చేస్తుంది. తెల్లరేషన్ కార్డుదారులకు ప్రతి రీఫిల్‌కు రూ.500సబ్సిడీ అందనుంది. గడిచిన మూడు సంవత్సరాల్లో వినియోగదారులు గృహ అవసరాలకు వాడిన గ్యాస్ సిలిండర్ల ఆధారంగా గ్యాస్ సబ్సిడీ ఇవ్వనున్నారు. ఇందుకోసం అధికారులు ప్రత్యేకంగా లెక్కలు తీశారు.

మార్చి1 అనంతరం జీరో బిల్లులు..

జిల్లాలో ఉచిత కరెంట్ కోసం 2,09,899 మంది ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 200 యూనిట్ల లోపు వాడే గృహ విద్యుత్ వినియోగదారులు 1,61,099 మంది ఉన్నారు. వీరి వివరాలను విద్యుత్ శాఖ సేకరించింది. లబ్ధిదారుల స్థానికత గుర్తింపు కోసం ఆధార్ కార్డు, ఆహార భద్రతా కార్డు, ఫోన్‌నంబర్లు సేకరించారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబంలో ఒక నెలలో 200 యూనిట్ల వరకు జీరో బిల్లును ఇస్తారు. మార్చి 1 అనంతరం వచ్చే విద్యుత్ బిల్లులతో జీరో బిల్లు పథకం అమలవుతుందని అధికారులు చెబుతున్నారు.

4న మోత్కూరు మున్సిపల్ చైర్మన్ ఎన్నిక

మోత్కూరు: మోత్కూరు మున్సిపల్ చైర్మన్ ఎన్నికను మార్చి 4న నిర్వహించనున్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ తీపిరెడ్డి సావిత్రిమేఘారెడ్డిపై వైస్ చైర్మన్‌తో సహా బీఆర్ఎస్, కాంగ్రెస్ కౌన్సిలర్లు జనవరి 20న అవిశ్వాసం ప్రకటించారు. ఈనెల 9న ఓటింగ్ నిర్వహించగా వైస్ చైర్మన్ వెంకటయ్యతో పాటు బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఆరుగురు, కాంగ్రెస్ కౌన్సిలర్లు నలుగురు కలిపి మొత్తం పది మంది కౌన్సిలర్లు అవిశ్వాసానికి అనుకూలంగా ఓటు వేశారు. దీంతో అవిశ్వాసం నెగ్గి చైర్ పర్సన్ సావిత్రిమేఘారెడ్డి పదవి కోల్పోయారు. చైర్మన్ స్థానం ఖాళీ అయినట్టు ప్రిసైడింగ్ అధికారి భువనగిరి ఆర్డీఓ అమరేందర్ ఉన్నతాధికారులకు నివేదించారు. ఈ నేపథ్యంలో మార్చి 4న ఉదయం 11 గంటలకు నూతన చైర్మన్ ఎన్నిక నిర్వహించేందుకు ఉన్నతాధికారులు నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిసింది. ఈమేరకు కలెక్టర్, ప్రిసైడింగ్ అధికారి ఆదేశాలతో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ కౌన్సిలర్లకు నోటీసులు జారీ చేయనున్నారు. కాగా.. 11వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ గుర్రం కవిత చైర్మన్ రేసులో ఉండగా కౌన్సిలర్లంతా ఆమెనే బలపరుస్తుండడంతో చైర్మన్ ఎన్నిక లాంఛనమే కానుంది.

చేనేత పథకాలను కొనసాగించాలి



మాట్లాడుతున్న మురళీధర్

మోత్కూరు: గత ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రవేశపెట్టిన చేనేత మిత్ర, చేనేతకు చేయూత, చేనేత బీమా, త్రిఫ్ట్ ఫండ్ లాంటి పథకాలను ప్రస్తుత ప్రభుత్వం యథావిధిగా కొనసాగించాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్ కోరారు. మంగళవారం మోత్కూరులోని పద్మశాలీ కాలనీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం చేనేత కార్మికుల ఖాతాల్లో రూ.2వేలు, అనుబంధ కార్మికుల ఖాతాల్లో రూ.500 జమ చేయగా ఎన్నికల పేరుతో నిలిపివేశారని తెలిపారు. చేనేత వస్త్రాలను ప్రభుత్వం కొనుగోలు చేసి కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. సమావేశంలో చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు వెంకటనర్సు, చేనేత సంఘం నాయకులు కొక్కుల సత్యనారాయణ, పెండెం రాజారావు, పసునూరి నారాయణ, జిల్లా సత్తయ్య, రేగోటి పరశురాములు, పోచం శ్రీనివాస్, కస్తూరి సంజీవ, కర్నాటి శ్రీరంగం, పసునూరి రమేష్ పాల్గొన్నారు.

ఎంజీయూ డిగ్రీ సెమిస్టర్ ఫలితాల విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ

నల్లగొండ రూరల్ : మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ 1, 3, 5వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను మంగళవారం ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి, రిజిస్ట్రార్ రవి, పరీక్షల నియంత్రణ అధికారి జి.ఉపేందర్‌రెడ్డి విడుదల చేశారు. మొదటి సెమిస్టర్‌లో మొత్తం 6,927 మంది విద్యార్థులు హాజరు కాగా 25.8 శాతం ఉత్తీర్ణత సాధించగా 73.7 శాతం ప్రమోట్ అయినట్లు తెలిపారు. మూడో సెమిస్టర్‌లో 7,135 మంది విద్యార్థులు హాజరు కాగా 31.9 శాతం ఉత్తీర్ణత సాధించగా 67.8 శాతం ప్రమోట్ అయ్యారని తెలిపారు. ఫలితాలపై సందేహం ఉన్న విద్యార్థులు ఒక సబ్జెక్టుకు రూ.200 చెల్లించి మార్చి 6వ తేదీలోగా రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఫలితాలను మొబైల్ యాప్ ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు.

ఓఎస్డీగా అల్వాల రవి కొనసాగింపు

ఎంజీయూ వీసీకి ప్రత్యేక అధికారి(ఓఎస్డీ)గా అల్వాల రవి మరో ఏడాది కొనసాగనున్నారు. ఈ మేరకు వీసీ గోపాల్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

ఎండుతున్న పంట.. అల్లాడుతున్న అన్నదాత



బోగారంలో ట్యాంకర్‌తో పొలానికి నీరు పెడుతున్న రైతు ధనుంజయ్

- అడుగంటిపోయిన బోర్లు, బావులు
- పొట్టదశలో ఎండిపోతున్న వరి చేలు
- పంటను కాపాడుకునేందుకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా

రామన్నపేట: గడిచిన ఎనిమిదేళ్లలో ఎప్పుడూ లేనివిధంగా భూగర్భజలాలు పాతాళానికి పడిపోయాయి. బావులు, బోర్లు అడుగంటిపోతుండడంతో వరిచేలు పొట్టదశలో ఎండిపోతున్నాయి. దీంతో పొలాలు కాపాడుకునేందుకు రైతులు పడరానిపాట్లు పడుతున్నారు. రామన్నపేట మండలంలో ప్రస్తుత యాసంగి సీజన్‌లో 13,973మంది రైతులు 28,640 ఎకరాల్లో వరి సాగుచేశారు. వీటికి ఆసిఫ్‌నహర్, శాలిగౌరారంప్రాజెక్టు కాలువలు ప్రధాన సాగునీటి వనరులు. ఇంద్రపాలనగరం, శోభనాద్రిపురం, లక్ష్మాపురం, నీర్నెముల, దుబ్బాక, మునిపంపుల, పల్లివాడ, ఎన్నారం, సూరారం, బాచుప్పల, తుర్కపల్లి గ్రామాల్లోని దిగువపొలాలకు ఆయా కాలువల ద్వారా సాగునీరు అందుతుంది. వెల్లంకి, సిరిపురం, రామన్నపేట, కొమ్మాయిగూడెం, జనంపల్లి, ఇస్కిళ్ల, ఉత్తటూరు గ్రామాల రైతులు బోరుబావులపైనే ఆధారపడి వరిసాగు చేస్తున్నారు. గతేడాదితో పోలిస్తే మండలంలో భూగర్భజలాలు 2.30మీటర్ల లోతుకు పడిపోయాయి. బోర్లమీద ఆధారపడి సాగుచేసిన పొలాల్లో ఇప్పటికే సగానికి పైగా ఎండిపోగా.. మరికొంతమంది రైతుల పొలాలు పూర్తిగా ఎండిపోయాయి.

పొలాలు కాపాడుకునేందుకు..

పొలాలు ఎండిపోకుండా కాపాడేందుకు అన్నదాతలు పడరాని పాట్లు పడుతున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.25వేల నుంచి రూ. 30వేల వరకు రైతులు పెట్టుబడి పెట్టారు. కళ్లెదుటే పంటచేలు ఎండిపోతుంటే ఖర్చుకు వెనుకాడకుండా ట్యాంకర్లతో నీళ్లు పోయిస్తున్నారు. ఒక్కో ట్యాంకర్‌కు రూ.500 నుంచి రూ.800 వరకు ఖర్చు చేస్తున్నారు. అంతేకాకుండా లక్షలు ఖర్చుచేసి బోర్లు వేయిస్తున్నారు. ఇస్కిళ్ల, జనంపల్లి గ్రామాలకు చెందిన రైతులు కిలోమీటర్ల మేర ఆసిఫ్‌నహర్ కాలువకు పైప్‌లైన్ పరచి నీళ్లు అందించే ప్రయత్నం చేస్తున్నారు.



రామన్నపేట శివారులో ఎండిపోయిన పొలం

రెండెకరాలు ఎండిపోయింది



రెండెకరాలలో వరిపొలం పెట్టాను. కలువు తీసిన కొద్దిరోజుల వరకు పొలం పారింది. క్రమేపీ బోర్లు పోయడం తగ్గాయి. పెట్టినకాడికి పొలమంతా ఎండిపోయింది. ఊర్లో మెజార్టీ రైతుల పరిస్థితి ఇదే. మూడెకరాలు కౌలుకు తీసుకొని పత్తివేస్తే పెట్టుబడి కూడా రాలేదు. ఇంటిల్లిపాది కష్టం పోనూ రూ.లక్ష వరకు నష్టం జరిగింది.

– పోచబోయిన నర్సింహ, జనంపల్లి

30 కేంద్రాలు.. 12,559 మంది విద్యార్థులు

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

భువనగిరి: జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఈ నెల 28 నుంచి ప్రారంభంకానున్న జనరల్ పరీక్షలు మార్చి 14న, ఒకేషనల్ పరీక్షలు 16వ తేదీన ముగియనున్నాయి. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు ఇప్పటికే సంబంధిత అధికారులకు శిక్షణ ఇవ్వడంతో పాటు ఈసారి ప్రతి కేంద్రంలో సిట్టింగ్ స్క్వాడ్స్‌ను నియమించారు. పరీక్షల నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా 30 కేంద్రాలు ఏర్పాటు చేశారు.

69 జూనియర్ కళాశాలలు

జిల్లా వ్యాప్తంగా మొత్తం ప్రభుత్వ, ప్రైవేట్ కలిసి 69 జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఇంటర్ పరీక్షల నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 30 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో రాజాపేట, మోత్కూర్, యాదగిరిగుట్టలో సెల్ఫ్ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణకు 30 మంది సూపరింటెండెంట్స్, 30 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్స్‌తో పాటు సుమారు 400 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. పరీక్షలు సజావుగా సాగేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన ఒక ఫ్లెయింగ్ స్క్వాడ్ బృందం, 30 మంది సిట్టింగ్ స్క్వాడ్స్‌ను నియమించారు. ఇందులో వివిధ శాఖలకు చెందిన వారు ఉన్నారు. ముగ్గురు సభ్యులతో కూడిన డీఈసీ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి డీఐఈఓ రమణి కన్వీనర్‌గా ఉన్నారు. కాగా.. జిల్లా వ్యాప్తంగా 11 ప్రశ్నపత్రాల స్టోరేజీ పాయింట్లు ఏర్పాటు చేశారు. వీటిలో భువనగిరి, రామన్నపేట, వలిగొండ, పోచంపల్లి, చౌటుప్పల్, నారాయణపూర్, ఆలేరు, మోత్కూర్, బొమ్మలరామారం, యాదగిరిగుట్ట, రాజాపేట ఉన్నాయి.



భువనగిరి పట్టణంలోని పరీక్ష కేంద్రంలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

పకడ్బందీగా నిర్వహిస్తాం



ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ఈసారి ప్రతి కేంద్రంలో సిట్టింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేశాం. పరీక్షల నిర్వహణ సమయంలో జిరాక్స్ సెంటర్లను మూసివేసే విధంగా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. కేంద్రాల్లో వాటర్‌తో పాటు మెడికల్ సిబ్బంది, సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరగనున్నాయి. సెల్ఫ్ సెంటర్లపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. నిమిషం నిబంధన ఉండటం వల్ల విద్యార్థులు 30 నిమిషాలు ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలి. పరీక్షల సందర్భంగా సమస్యలు ఉంటే 85199 42273నంబర్‌ను సంప్రదించాలి. అవసరమైతే ఫిర్యాదులతో పాటు సమాచారం కోసం కలెక్టరేట్‌లో జీ12 ఇంటర్మీడియట్ కార్యాలయంలో సంప్రదించాలి.

– రమణి, డీఐఈఓ

ప్రతి కేంద్రం వద్ద 144 సెక్షన్

ఇంటర్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 30 కేంద్రాల్లో మొత్తం 12,553 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షలకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 6,450 మంది, ప్రథమ సంవత్సరం విద్యార్థులు 6,109 మంది హాజరుకానున్నారు. ప్రతి కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించనున్నారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు. పరీక్ష సమయానికి నిమిషం ఆలస్యంగా వచ్చినా కేంద్రంలోకి అనుమతిని నిరాకరించనున్నారు. నిమిషం నిబంధన అమలు చేయనున్నారు.

క్లుప్తంగా

ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో సిల్వర్ మెడల్



డాగ్ రోలెక్స్‌కు మెడల్ అందజేస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట క్రైం : లక్నోలో ఈ నెల 16న జరిగిన 67వ ఆల్ ఇండియా పోలీసు డ్యూటీ మీట్‌లో సూర్యాపేట జిల్లా పోలీసు విభాగానికి చెందిన డాగ్ రోలెక్స్ నార్కోటిక్ పదార్థాల గుర్తింపులో సిల్వర్ మెడల్ గెలిచింది. ఈ సందర్భంగా ఎస్పీ రాహుల్ హెగ్డే తన కార్యాలయంలో డాగ్ రోలెక్స్‌కు మెడల్ అందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, ఆర్మ్‌డ్ రిజర్వ్ అదనపు ఎస్పీ జనార్దన్‌రెడ్డి, ఆర్ఐ నర్సింహ, ఆర్ఎస్ఐలు సురేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

మహిళ మెడలో పుస్తెలతాడు అపహరణ

ఆలేరురూరల్ : గుర్తుతెలియని వ్యక్తి మహిళ మెడలో పుస్తెల తాడును అపహరించాడు. ఈ ఘటన ఆలేరులో మంగళవారం చోటు చేసుకుంది. ఆలేరు పట్టణ కేంద్రంలోని పోచమ్మ గుడి సమీపంలో నివాసం ఉంటున్న ఎగ్గిడి సిద్దమ్మ ఉదయం ఇంటి ఆవరణంలోని బాత్‌రూమ్‌కి వెళ్లి తిరిగి ఇంట్లోకి వస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి వెనక నుంచి వచ్చి ఆమె మెడలోని ముడున్నర తులాల బంగారు పుస్తెల తాడు లాక్కొని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటశ్రీను తెలిపారు తెలిపారు.

వృద్ధురాలు అదృశ్యం

అడ్డగూడూరు : వృద్ధురాలు అదృశ్యమైంది. ఈ ఘటన అడ్డగూడూరు మండల కేంద్రంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. మండల కేంద్రానికి చెందిన పూలపల్లి కమలమ్మ(68) అడ్డగూడూరు మండల కేంద్రంలో ఒంటరిగా జీవిస్తోంది. అమె కూమారుడు నర్సిరెడ్డి హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. కమలమ్మ ఈ నెల 24న ఇంటికి తాళం వేసి బయటికి వెళ్లింది. రోజులు గడుస్తున్నా ఆమె ఇంటికి తిరిగి రాకపోవడంతో స్థానికులు కమలమ్మ కుమారుడికి సమాచారం ఇచ్చారు. నర్సిరెడ్డి బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

ఉత్సవాలకు యాదాద్రి ముస్తాబు

- 5 నుంచి శివరాత్రి ఉత్సవాలు
- 11వ తేదీ నుంచి యాదాద్రీశుడి వార్షిక బ్రహ్మోత్సవాలు



యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం వరుస ఉత్సవాలకు ముస్తాబవుతోంది. మహా శివరాత్రిని పురస్కరించుకొని వచ్చే నెల 5వ తేదీ నుంచి కొండపైనే అనుబంధ ఆలయమైన శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి (శివాలయం) ఉత్సవాలను నిర్వహించనున్నారు. 11వ తేదీ నుంచి యాదాద్రీశుడి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్నాయి. కొండపైన గల శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో మార్చి 5వ తేదీ నుంచి 10వ తేదీ వరకు మహా శివరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నారు. పాంచాహ్నిక దీక్షతో నిర్వహించే ఈ ఉత్సవాలను ఐదు రోజుల పాటు కొనసాగనున్నాయి. 7వ తేదీన రాత్రి 7గంటలకు శ్రీపర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. 8వ తేదీ మహాశివరాత్రిని పురస్కరించుకొని అభిషేకములు, రాత్రి లింగోద్భవ కాలములో మహాన్యాస పూర్వక శతరుద్రాభిషేకం జరిపిస్తారు. 10వ తేదీన మధ్యాహ్నం పూర్ణాహుతి, రాత్రి డోలోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి.

11 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

పంచనారసింహుడిగా కొలువబడుతున్న యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు 11వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. స్వస్తీ వాచనంతో ఉత్సవాలకు ఆచార్యులు శ్రీకారం చుడతారు. 12వ తేదీన ధ్వజారోహణము, దేవతాహ్వానం, వేద పారాయణం, హవన జరిపిస్తారు. అదే రోజు అలంకార సేవలు, ధార్మిక సభా కార్యక్రమాలు ప్రారంభం అవుతాయి. ప్రధాన ఘట్టాలైన శ్రీస్వామి అమ్మవార్ల ఎదుర్కోలు ఉత్సవం 17వ తేదీన, తిరు కల్యాణ మహోత్సవం 18వ తేదీన, రథోత్సవం 19న, చక్రతీర్థ స్నానం 20న నిర్వహిస్తారు. 21వ తేదీన శతఘటాభిషేకం ఉత్సవంతో వార్షిక బ్రహ్మోత్సవాలను ముగింపు చేస్తారు.

8న అఖండ జ్యోతి యాత్ర

యాదాద్రీశుడి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని హైదరాబాద్ బర్కత్‌పురలోని యాదగిరి భవన్ నుంచి మహా శివరాత్రి రోజు 8వ తేదీన ఉదయం 9.30గంటలకు శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి 30వ అఖండ జ్యోతి యాత్ర ప్రారంభం అవుతుంది. ప్రతి ఏడాది మాదిరిగానే యాత్ర నిర్వాహకులు అఖండ జ్యోతి యాత్రను దివ్య పుష్ప రథంపై ఊరేగింపుగా యాదాద్రికి తీసుకురానున్నారు. 8వ తేదీన బర్కత్‌పురలో ప్రారంభమయ్యే అఖండ జ్యోతి యాత్ర 11వ తేదీన యాదాద్రీశుడి బ్రహ్మోత్సవాల తొలిరోజు యాదగిరిగుట్టకు చేరుకుంటుంది.

రైతుపై ఇసుక ట్రాక్టర్ల యజమానుల దాడి



గాయపడిన మల్లారెడ్డి

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : తమ ట్రాక్టర్లను పోలీసులకు పట్టించారన్న అనుమానంతో ఓ రైతుపై ఇసుక ట్రాక్టర్ల యాజమానులు దాడి చేశారు. ఈ ఘటన ఆత్మకూర్ (ఎస్) మండల పరిధిలోని ఏపూరు గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఏపూరి ఏటిలో నుంచి మంగళవారం ఇసుకను తరలిస్తుండగా స్థానిక ఎస్ఐ సైదులు తన సిబ్బందితో కలిసి రెండు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నాడు. దీంతో ఇసుక ట్రాక్టర్లను కావాలనే పట్టించాడని రెండు ట్రాక్టర్ల యాజమానులు, మరికొంతమందితో కలిసి గ్రామానికి చెందిన గొట్టిముక్కుల మల్లారెడ్డిపై దాడికి పాల్పడ్డారు. గాయాలైన మల్లారెడ్డిని చికిత్స నిమిత్తం సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు. దాడికి పాల్పడిన ఇసుక ట్రాక్టర్ యజమాని ఉపేందర్‌ను పోలీసులు అదుపులో తీసుకున్నారు. మల్లారెడ్డి భార్య గొట్టిముక్కుల నాగమణి ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన సానబోయిన ఉపేందర్, సతీష్, శ్రీకాంత్‌ల పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సైదులు తెలిపారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

మేళ్లచెరువు : హత్య కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి నిందితుల వివరాలు వెల్లడించారు. మేళ్లచెరువు మండల కేంద్రానికి చెందిన వీరగోపయ్య ఈ నెల 24న రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. అతడి ఒంటిపై గాయాలు ఉండడంతో మరుసటి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమానంతో గోపయ్య భార్య వీరకుమారిని అదుపులోకి తీసుకుని విచారించగా తన ప్రియుడు షేక్ సైదా హుస్సేన్‌తో కలిసి పథకం ప్రకారం దిండు అదిమి పట్టి హత్య చేసినట్లు ఒప్పుకుంది. మంగళవారం షేక్ హుస్సేన్ అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితులపై సెక్షన్ 302, 341 లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసును త్వరితగతిన ఛేదించిన కోదాడ రూరల్ సీఐ రజిత రెడ్డి, ఎస్ఐ.పరమేష్,కానిస్టేబుల్ నాగేశ్వరరావు, గోపయ్య,శ్రీనివాస్ లను ఎస్పీ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.





విద్యార్థులతో ప్రయోగం చేయిస్తున్న ఉపాధ్యాయురాలు

విద్యార్థి కేంద్రీకృత అభ్యసనానికి ప్రాధాన్యమిస్తూ వారిలోని సృజనాత్మకతను వెలికితీస్తున్నారు గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లి జెడ్పీహెచ్ఎస్ జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు మారం పవిత్ర. విద్యార్థులకు అర్థవంతంగా బోధిస్తూ వారిచేతనే తగిన ప్రయోగాలు చేయిన్నారు. విద్యార్థుల ఉన్నతికి ఆమె చేస్తున్న కృషిని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక చేసింది. ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు ఫరీదాబాద్‌లో నిర్వహించిన ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌లో ఆమె పాల్గొన్నారు. బుధవారం సైన్స్ డే సందర్భంగా ఈ ఉపాధ్యాయురాలిపై ప్రత్యేక కథనం.

- నల్లగొండ డెస్క్

ప్రయోగాత్మక బోధన పవిత్ర టీచర్ ప్రత్యేకత

- విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీస్తున్న ఉపాధ్యాయురాలు
- విద్యార్థి కేంద్రీకృత బోధనకు ప్రాధాన్యం
- ఆమె సేవలకు గుర్తింపుగా రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డులు

నేడు నేషనల్ సైన్స్‌డే



విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టును పరిశీలిస్తున్న టీచర్ పవిత్ర

పవిత్ర 2008లో డీఎస్సీ ద్వారా ఉద్యోగం సాధించారు. మొదట ఆత్మకూర్(ఎస్) మండలం రామన్నగూడెం యూపీఎస్‌లో ఉపాధ్యాయురాలిగా విధులు చేపట్టారు. 2012 నుంచి 2015 వరకు గోరెంట్ల జెడ్పీహెచ్ఎస్‌లో జీవశాస్త్ర ఉపాధాయురాలిగా, 2015 నుంచి గరిడేపల్లి మండలం గడ్డిపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో విధులు నిర్వహిస్తున్నారు. వరి పొలాల్లో రైతులు వరాలు తీయడానికి (గట్లు చెక్కడానికి) పడే కష్టానికి పరిష్కారం చూపడం. నీటిపై తేలే చెత్తను తొలగించడానికి ఉపయోగించే పరికరం, ఏకో ఫ్రెండ్లీ రాఖీల తయారీ, మొక్కలకు ఉపయోగపడే బయోటానిక్ లాంటివి ఈమె సారథ్యంలో విద్యార్థులు తయారు చేసినవే. ఇవే కాకుండా చాలా మంది విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయిలో జరిగిన సైన్స్ ఫెయిర్‌లో తమ ప్రయోగాలను ప్రదర్శించారు.

సులభరీతిలో బోధన

- ప్రయోగాలు చేయడం, కృత్యాల ద్వారా నేర్చుకోవడం, పాత్ర పోషణ పద్ధతులు డ్రామా, నాటకీకరణం పద్ధతులు ఇంటరాక్టివ్ గేమ్స్, ఫజిల్స్, క్రాస్ వర్డ్‌ఫజిల్స్, ఇంటరాక్టివ్ వీడియోస్, డ్రోన్, డ్రాప్ వీడియోలు ప్రాక్టీస్ చేయిస్తారు.
- సులభతరంగా ఉండే వెబ్‌సైట్స్ ప్లానెటా 42 వర్డ్‌వాల్ క్విజ్, మెంటిమీటర్ వంటి కార్యక్రమాలు వినియోగిస్తారు.
- దీక్ష యాప్‌లో ఉండే వీడియోస్ కంటెంట్‌ను పిల్లలకు అర్థమయ్యే రీతిలో అందిస్తారు.
- పరిసరాలలో దొరికే నోకాస్ట్.. లోకాస్ట్ మెటీరియల్స్‌ను విద్యార్థుల చేత సేకరింపజేసి లేదా తానే సేకరించి తరగతిలో నమూనాలు తయారు చేయించి అవగాహన కల్పిస్తారు.
- మైక్రోస్కోప్, పోల్డ్‌స్కోప్ ఇంటరాక్టివ్ ఫ్లాట్ ఫానెట్ బోర్డులు, ప్లాస్టిక్ వైర్లు, సివర్జిస్ మొదలగు వాటితో జీర్ణవ్యవస్థ, విసర్జన వ్యవస్థ, దినవలయ రక్త ప్రసరణం, నాడీ లక్షణాల మధ్య సమాచార ప్రసారం, సిగరేట్ తాగటం వల్ల ఊపరితిత్తులు ఎలా పాడవుతాయి అని చూపే నమూనా, శ్వాసక్రియలో డయాఫ్రమ్ పాత్ర, స్టెతస్కోప్, ఆవరణ పిరమిడ్, సమవిభజన, క్షయకరణ విభజన, మోనోహైబ్రిడ్ పరాగ సంపర్కం రకాలు, ఫలదీకరణ శ్రేణి, సమాంతర సంతానం వంటి అంశాలను వర్కింగ్ మోడల్స్ తయారు చేసి వివరిస్తారు.



సైన్స్ ప్రయోగాలపై వివరిస్తున్న ఉపాధ్యాయురాలు పవిత్ర

ప్రయోగపూర్వకంగా బోధించాలి



విద్యార్థులు సిద్ధాంత పరంగా నేర్చుకున్న విషయాలు ప్రయోగ పూర్వకంగా నిర్ధారణ చేసి చూసుకునే అవకాశం, పరిస్థితులను ఉపాధ్యాయులు కల్పించాలి. బోధనాభ్యసన ప్రక్రియలో విద్యార్థి భాగస్వామ్యానికి ప్రాధాన్యమివ్వాలి. విద్యార్థిలో నిరంతరం ప్రశ్నించి నేర్చుకునే లక్షణాన్ని పెంపొందించాలి. సమాజంలో ఎదుర్కొంటున్న చిన్న చిన్న సమస్యలను తరగతి గదిలో చర్చించి వాటికి పరిష్కారాలను విద్యార్థులే సూచించేలా చేయాలి. సైన్స్ అభ్యసనంలో ప్రయోగాత్మకతకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. పాఠశాల దశలో ఏర్పడే ఆసక్తి, అన్వేషణ, ప్రశ్నించేతత్వం భావి శాస్త్రవేత్తల రూపకల్పనకు దారితీస్తుంది.

– పవిత్ర, జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు

పొందిన అవార్డులు..

- 2023–24 రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు పొందారు.
- 2022–23 లయన్స్ ఇంటర్నేషనల్ హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి ఉత్తమ టీచర్‌గా అవార్డు అందుకున్నారు. ప్రైడ్ ఆఫ్ ఉమెన్ ఆఫ్‌ది ఇయర్‌కు ఎంపికయ్యారు.
- 2023 ఫిబ్రవరి 28న నేషనల్ సైన్స్‌డే సందర్భంగా సారాబాయ్ టీచర్ సైంటిస్ట్ నేషనల్ అవార్డును జమ్మూ కశ్మీర్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ రవిశంకర్ శర్మ చేతుల మీదుగా అందుకున్నారు.
- అంతర్జాతీయ మహిళా దినోత్సవం 2022 సందర్భంగా అకడమిక్ అచీవ్‌మెంట్ అవార్డ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రైడ్ విమెన్ ఆఫ్ ది ఇయర్ అవార్డును ఆన్‌లైన్‌లో పొందారు.
- 2023–24లో ఆగస్త్య అంతర్జాతీయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుప్పంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్–తెలంగాణ రాష్ట్రాల ప్రభుత్వ పాఠశాలల్లో 6, 7, 8, 9, 10 తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆన్‌లైన్‌లో నిర్వహించిన జిజ్ఞాసి ఇన్నోవేటివ్ సైన్స్ కాంపిటీషన్ పోటీల్లో గడ్డిపల్లి పాఠశాల విద్యార్థులు రూపొందించిన వీడర్ అండ్ సీడర్ అనే ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపికైంది.



పూలే అవార్డు అందుకుంటున్న పవిత్ర(ఫైల్)

తహసీల్దార్ ఎదుట బైండోవర్

వలిగొండ : అనుమానాస్పద స్థితిలో సంచరిస్తున్న ఇద్దరిని గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన వలిగొండ మండలం వెల్వర్తి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఆంధ్రద్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు ఇల్లా జూపాడు బంగ్లా బుడగ జంగాల పేటకు చెందిన ఇప్ప సత్యాలు అతడి భార్య మంగమ్మ బతుకు దేరువుకోసం ఊర్లు తిరుగుతూ విరాళాలు సేకరించి జీవనం గడుపుతున్నారు. వీరు వెల్వర్తి గ్రామంలో అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో పిల్లలను కిడ్నాప్ చేసే వ్యక్తులుగా భావించి గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వారిని తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి వద్ద బైండోవర్ చేశామని ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపారు.

సోలార్‌సిస్టమ్ ఇన్‌స్టాలేషన్ అండ్ సర్వీస్ కోర్సులో ఉచిత శిక్షణ

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని జలాల్‌పురంలో గల స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో దీన్‌దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకం ద్వారా నాలుగు నెలల కాలపరిమితి కల్గిన సోలార్‌సిస్టమ్ ఇన్‌స్టాలేషన్ అండ్ సర్వీస్ అనే ఉపాధి ఆధారిత సాంకేతిక కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తున్నామని సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పదో తరగతి పాసు లేదా ఐటీఐ విద్యార్హత కల్గి, 18 నుంచి 35 సంవత్సరాల మధ్య మయస్సు కలిగి ఉండాలని తెలిపారు. ఎస్టీ, ఎస్సీ, మైనార్టీ విద్యార్థులకు ప్రాధాన్యత కల్పించబడుతుందని తెలిపారు. ఆసక్తి కల్గిన అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో మార్చి 1న సంస్థలో నిర్వహించే కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత హాస్టల్, భోజన వసతి కల్పించబడుతుందని పేర్కొన్నారు. వివరాలకు 9848908059, 9133908000 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఇద్దరు దొంగల అరెస్ట్

యాదగిరిగుట్ట రూరల్ : బాబాల వేశంలో వచ్చి చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. సిద్దిపేట జిల్లా ఎల్లారెడ్డిపేటకు చెందిన ఎండి హుసేన్, ఎండి.జాహంగీర్ భిక్షాటన చేస్తూ ఆలేరు మండలంలోని మల్లాపూర్‌కు వచ్చారు. గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ ఇంట్లోకి ప్రవేశించి పూజలు చేస్తే మంచి జరుగుతుందని నమ్మబలికారు. అతడిని మాటల్లో పెట్టి రూ.2వేలను అపహరించారు. అనుమానంతో లక్ష్మీనారాయణ కేకలు వేయడంతో స్థానికులు వచ్చి ఎండి హుసేన్, జాహంగీర్‌ను పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారిని పట్టుకుని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని ఎస్ఐ రమేష్ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

భువనగిరి రూరల్ : షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. భువనగిరి మండలంనందనం గ్రామానికి చెందిన కడమంచి కరుణాకర్ ఆటోడ్రైవర్ జీవనం సాగిస్తున్నాడు. ఉదయం బంధువుల శుభకార్యానికి భార్యభర్తలు వెళ్లగా ఎవరూ లేని సమయంలో షార్ట్ సర్క్యూట్ జరిగి ఇంట్లోని వస్తువులు తగలబడ్డాయి. దీంతో సుమారు రూ.5 లక్షల ఆస్తినష్టం సంభవించింది. పేద కుటుంబాన్ని ఆదుకోవాలని మాజీ వార్డు సభ్యుడు ముగ్గు బీంరాజ్ కోరారు.

ఇద్దరు మహిళలపై బ్లేడ్‌తో దాడి





గాయపడిన స్వరూప, నాగలక్ష్మి

గరిడేపల్లి : కుటుంబ తగాదాలతో ఓ వ్యక్తి భార్య, వదినపై బ్లేడ్‌తో దాడి చేసి గాయపర్చాడు. ఈ ఘటన గరిడేపల్లి మండలం కాల్వపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. మేళ్లచెరువు మండలం రేవూరు గ్రామానికి చెందిన యరకలపూడి నాగార్జునతో కాల్వపల్లి గ్రామానికి చెందిన నాగలక్ష్మికి ఏడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఆరేళ్ల కొడుకు ఉన్నాడు.వీరి సంసారంలో గొడవలు ప్రారంభమయ్యాయి. దీంతో నాగలక్ష్మి మూడేళ్లుగా పుట్టింట్లో ఉంటుంది. ఒంటరిగా ఉంటున్న నాగలక్ష్మి సంవత్సర కాలంగా హుజూర్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో ఉద్యోగం చేస్తుంది. అనుమానంతో ఫోన్లో ఎప్పుడూ గొడవపడే నాగార్జున ఫైనాన్స్ కార్యాలయానికి ఉదయం వెళ్లి గొడవ చేశాడు. అక్కడ ఉన్న సిబ్బంది బదతిమిలాడి పంపించి వేశారు. సాయంత్రం కాల్వపల్లి వెళ్లి భార్య నాగలక్ష్మితో గొడవకు దిగి బ్లేడ్‌తో దాడి చేశాడు. అడ్డొచ్చిన వదిన స్వరూప పై దాడికి దిగాడు. గాయపడిన వారిని హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. నాగార్జునను గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

కారు ఢీకొని రైతు మృతి

- మృతుడిది ఆలేరు మండలం శారాజీపేట

జనగామ: రోడ్డు ప్రమాదంలో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం రాత్రి జనగామ మండలం పెంబర్తి కాకతీయ కళాతోరణం సమీపంలో వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిపై జరిగింది. ఎస్సై సృజన్ కథనం ప్రకారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం శారాజీపేట గ్రామానికి చెందిన రైతు ఉప్పు నర్సింగారావు(40) పెంబర్తి వద్ద తనకున్న వ్యవసాయ పొలంలో పనులు ముగించుకుని ద్విచక్రవాహనంపై తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో వరంగల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు.. బైక్‌ను ఢీకొంది. దీంతో నర్సింగారావు అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కల్తీ ఎరువులతో జాగ్రత్త

- ఎరువుల వాడకంపై పెద్దవూర ఏఓ సందీప్ సూచనలు



కాంప్లెక్స్ ఎరువులు

పెద్దవూర: పంటల సాగులో అధిక దిగుబడులు సాధించాలని అన్నదాతలు ఎరువులను విరివిగా వాడుతుంటారు. ఎరువుల్లో కల్తీ జరిగితే రైతులు తీవ్రంగా నష్టపోతారు. వేల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసే ఎరువుల్లో కల్తీ ఉంటే దాని ప్రభావం పైరు ఎదుగుదలతో పాటు దిగుబడులపై కూడా ఉంటుంది. పరీక్షలు చేయించుకున్న తరువాత ఎరువులను వాడుకుంటే మేలు జరుగుతుంది. ఎరువుల్లో కల్తీని గుర్తించటం, పరీక్షల గురించి మండల వ్యవసాయ అధికారి పి.సందీప్ వివరించారు. ఎరువుల వాడకంపై రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు.

ఎరువుల కల్తీతో అన్నదాత తీవ్రంగా నష్టపోతున్నారు. ఎరువులు కొనే ముందు జాగ్రత్తలు పాటించాల్సి ఉంది. ప్రస్తుతం మార్కెట్‌లోకి కల్తీ, నాసిరకం, నకిలీ ఎరువులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఎరువు కాని పదార్థాన్ని ఎరువు రూపంలోనే తయారు చేసి కలుపుతున్నారు. పోషకాలు తక్కువగా ఉన్న వాటిని, ఎక్కువగా ఉన్నాయని చెప్పి రైతులకు అంటగడుతున్నారు. అమ్మోనియం క్లోరైడ్, అమ్మోనియం సల్ఫేట్‌లలో ఉప్పును కలుపుతారు. సూఫర్ పాస్ఫేట్‌లో సుద్దపొడి, జిప్సం, యూరియాలలో సాధారణ ఉప్పును కలిపే అవకాశం ఉంది. ఎంఓపీలో ఇసుక, ఉప్పు, కలిపే అవకాశం ఎక్కువగా ఉంటుంది. గుళిక రూపంలోని సూఫర్ పాస్ఫేట్‌ను డీఏపీ లేదా ఎస్‌పీజే కాంప్లెక్స్ ఎరువులుగా నమ్మించి అమ్ముతుంటారు. సాధారణ ఉప్పును కూడా ఎంఓపీగానూ, లేక సల్ఫేట్‌గానూ, మెగ్నీషియం సల్ఫేట్‌ను జింక్ సల్ఫేట్‌గానూ విక్రయాలు జరుపుతుంటారు.

నాణ్యత పరీక్షలు ఇలా..

- ఒక పరీక్ష నాళికలో ఒక గ్రాము యూరియా ఎరువును 5 మిల్లీ లీటర్ల నీటిలో వేసి బాగా కలియబెట్టాలి. దీనిలో 5–6 చుక్కల సిల్వర్ నైట్రేట్ ద్రావణం కలపాలి. తెల్లని అవక్షేపంగా మారితే అది కల్తీ ఎరువుగా గుర్తించాలి.

పాడి పంట

- పొడిలా తయారు చేసుకున్న గ్రాము డీఏపీని పరీక్ష నాళికలో వేసి 5 మిల్లీ లీటర్ల స్వచ్ఛమైన నీటిలో కలపాలి. దానికి ఒక మిల్లీ లీటర్ నైట్రిక్ యాసిడ్ వేసి కదిపితే అర్థపార్శక ద్రావణం ఏర్పడితే అది నాణ్యమైనదిగానూ, అలా కాకుండా కరగని పదార్థం అడుగు భాగంలో చేరితే కల్తీదిగానూ భావించాలి.
- పరీక్ష నాళికలో ఒక గ్రాము మ్యూరేట్ ఆఫ్ పొటాష్(ఎంఓపీ) ఎరువులో 5 మిల్లీ లీటర్ల నీటిని పోసి బాగా కరిగేటట్లు చేయాలి. ఎక్కువ భాగం నీటిలో కరుగుతుంది. కొద్దిపాటి ఎరువు పదార్థం నీటిపై తేలితే స్వచ్ఛమైన ఎరువుగానూ, ఎక్కువ మొత్తంలో కరగకుండా అడుగుభాగం చేరితే అది కల్తీ ఎరువుగానూ గుర్తించాలి.
- కాంప్లెక్స్ ఎరువుల విషయంలో గ్రాము ఎరువును 5 మిల్లీ లీటర్ల నీటిలో కలిపి బాగా కదపాలి. దీనికి మిల్లీ లీటర్ సోడియం హైడ్రాక్సైడ్ ద్రావణం కలిపి ఒక వైపు నుంచి పరీక్ష నాళికను వేడిచేయాలి, తడిగా ఉన్న ఎర్రలిట్మస్ పేపర్‌ను పరీక్ష నాళిక ద్వారం దగ్గర ఉంచితే లిట్మస్ కాగితం నీలి రంగులోకి మారితే నత్రజని ఉందని గుర్తించాలి. అదే పరీక్షకు 2 మిల్లీలీటర్ల ఫెర్రిక్ క్లోరైడ్ అమ్మోనియం ఎసిఫేట్ కలపాలి. పసుపు రంగు అవక్షేపం వస్తుంది. దీనికి 5–6 చుక్కల నైట్రిక్ యాసిడ్ కలిపితే అవక్షేపం కరిగిపోతుంది. అలా జరిగితే ఫాస్ఫేట్ ఉన్నట్లు గుర్తించాలి.
- ఎరువుల కొనుగోలు విషయంలో దుకాణం గుడ్‌విల్‌ను కూడా దృష్టిలో ఉంచుకోవాలి. కొనుగోలు సమయంలో రసీదులు తీసుకోవడం వంటివి మర్చిపోకూడదు. ఎరువుల పరీక్షలు చేయటం రైతులకు ఇబ్బంది అనిపిస్తే ఎటువంటి అనుమానం వచ్చినా వ్యవసాయ అధికారులకు సమాచారం అందించాలి.

> - గ్రాము ఎరువును తీసుకుని 5 మిల్లీ లీటర్ల నీటిలో ఎరువును కరిగించాలి. ఫిల్టర్ పేపర్ సాయంతో వడపోయాలి. దీనికి 2 మిల్లీ లీటర్ల ఫార్మల డీహైడ్ ద్రావణం కలపాలి. 5 నిమిషాల తర్వాత ద్రావణం ఎరువులా మారుతుంది. దీనికి సోడియం హైడ్రాక్సైడ్ ద్రావణం ఒక్కొక్క చుక్క పసుపు రంగు వచ్చేదాకా కలపాలి. దీనికి మిల్లీ లీటర్ కోబాల్ట్ నైట్రేట్ ద్రావణం కలిపితే పసుపుపచ్చ అవక్షేపం ఏర్పడుతుంది. ఇలా జరిగితే ఎరువులో పొటాష్ ఉన్నట్లు గుర్తించాలి.